సాక్షి రంగారెడ్డి

గురువారం । 11 । జనవరి । 2024



పెరటి కోళ్లతో ఆదాయం

పెరటి కోళ్ల పెంపకంపై దృష్టి సారించాలని రాజేంద్రనగర్ పశు వైద్య కళాశాల వైస్ చాన్స్‌లర్ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. 8లో▸



విరిగిపడిన చెట్టుకొమ్మ

హైదరాబాద్– బీజాపూర్ జాతీయ రహదారిపై మర్రి చెట్టు భారీ కొమ్మ విరిగిపడి వాహనదారులకు ప్రమాదం తప్పింది. 8లో▸



మహనీయుల బాటలో..

మహనీయులు అడుగుజాడల్లో నడవాలని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్‌నీడ్ సంస్థ వ్యవస్థాపకురాలు గీతథామస్‌రెడ్డి అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

కన్హాను సందర్శించిన మంత్రి జూపల్లి



కన్హా శాంతివనంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే శంకర్

నందిగామ: మండల పరిధిలోని కన్హా శాంతివనాన్ని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి బుధవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా కన్హా శాంతివనంలో జరుగుతున్న ఓ సదస్సుకు హాజరైన ప్రముఖులను కలిసినట్లు తెలిసింది. కన్హాను సందర్శించిన వారిలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, ఎంపీటీసీలు దేవపల్లి కుమార్ గౌడ్, కొమ్ము కృష్ణ, కొత్తూరు, నందిగామ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంగ నర్సింహా యాదవ్, హరినాథ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన జేడీ



డిగ్రీ కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న యాదగిరి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను.. కళాశాల విద్యా జాయింట్ డైరెక్టర్ ప్రొ.యాదగిరి బుధవారం సందర్శించారు. కళాశాలలోని వసతులను పరిశీలించి.. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వినోభానగర్‌లో నిర్మిస్తున్న డిగ్రీ కళాశాల కొత్త భవనం నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రిన్సిపల్ ప్రభు ఆయన్ని కోరారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న కొత్త భవనాన్ని పరిశీలించి త్వరగా పనులు పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులను జేడీ యాదగిరి కోరారు. అనంతరం ఆయనను కళాశాల అధ్యాపకులు ఘనంగా సన్మానించారు.

ఉప్పల్ టెస్ట్ మ్యాచ్‌కు ప్రత్యేక భద్రత

రాచకొండ సీపీ సుధీర్‌బాబు



ఉప్పల్: ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 25 నుంచి 29 వరకు భారత్, ఇంగ్లాడ్ జట్ల జరనున్న టెస్ట్ మ్యాచ్‌కు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు తెలిపారు. మ్యాచ్ నిర్వహణ, బందోబస్తు తదితర అంశాలపై ఆయన బుధవారం సీపీ పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రత పరంగా ప్రతీ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రేక్షకులు, అభిమానులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. టికెట్ల పంపిణీలో ఎలాంటి గందరగోళానికి తావివ్వకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మల్కాజిగిరి డీసీపీ పద్మజ, ఎస్బీ డీసీపీ కరు ణాకర్, ట్రాఫిక్ డీసీపీ మనోహర్, అడ్మిన్ డీసీపీ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డున పడిన అర్జీలపై విచారణ

కుత్బుల్లాపూర్: ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే విషయంలో ప్రైవేటు వ్యక్తులకు అధికారులు అందజేసిన విషయంపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ విచారణకు ఆదేశించారు. దీనిపై కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ పర్యవేక్షణలో యూబీ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.పద్మనాభకు బాధ్యతలు అప్పగించి విచారణ త్వరగా పూర్తి చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిల్ పరిధిలో మొత్తం 1, 48,151 దరఖాస్తులు రాగా భగత్‌సింగ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో కొన్ని, సర్కిల్ కార్యాలయంలో మరికొన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇదే క్రమంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ అధికారులు కొంతమంది ప్రైవేటు వ్యక్తులకు ఇంటి వద్ద అప్‌లోడ్ చేయాలని ఒక్కొక్కరికి 200 చొప్పున దరఖాస్తులు ఇచ్చారు. వీటిని తీసుకుని ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తున్న క్రమంలో రోడ్డుపై పడ్డాయి. ఈ విషయంపై రోనాల్డ్ రాస్ విచారణకు ఆదేశించారు.

అసెస్‌మెంట్స్‌లో చేతివాటం!

- ట్రేడ్ లైసెన్సులు, ఆస్తుల అసెస్‌మెంట్స్‌లో అధికారుల ఇష్టారాజ్యం
- టార్గెట్ మేరకు వసూలు కాని పన్నులు
- ఆర్థిక సంక్షోభంలో మున్సిపాలిటీలు
- అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వంపై ఆధారపడుతున్న వైనం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ట్రేడ్ లైసెన్సులు, ఆస్తుల అసెస్‌మెంట్స్‌లో సంబంధిత అధికారులు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. వారు అడిగినంత ఇస్తే చాలు ఆస్తుల విలువను, పన్నుల వసూళ్లను తగ్గించేస్తున్నారు. ఫలితంగా జిల్లాలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఆయా వర్గాల నుంచి రావాల్సిన ఆదాయానికి భారీగా గండిపడుతోంది. నిజానికి ఇతర జిల్లాల్లోని మున్సిపాలిటీలతో పోలిస్తే రంగారెడ్డి జిల్లాలోని మున్సిపాలిటీలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. పెద్ద సంఖ్యలో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు జరుగుతుండటంతో పాటు భూముల అమ్మకాల ద్వారా కూడా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతోంది. అయితే వ్యాపార సముదాయాలకు, నివాస భవనాలకు ఆస్తిపన్నుల అసెస్‌మెంట్ చేయడంలో సంబంధిత అధికారులు, సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలోని నిర్మాణాలకు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, హోర్డింగ్‌ల నుంచి వసూలు చేస్తున్న ఆస్తి పన్నులకు అసలు పొంతనే ఉండటం లేదు. ఆశించిన స్థాయిలో నిధులు మంజూరు చేయకపోవడం, అంతర్గత వనరుల నుంచి పన్నులు వసూలు కాకపోవడంతో చిన్నచిన్న అభివృద్ధి పనులకు కూడా మున్సిపాలిటీలు ప్రభుత్వంపైనే ఆధారపడాల్సి వస్తుంది. నేటికీ అనేక కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్ల మధ్యనే మురుగు పారుతోంది. ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు కనీస సదుపాయాలకు నోచుకోవడంలేదు. మరికొద్ది రోజుల్లో ఈ ఆర్థిక సంవత్సరం ముగియనుండటం, ఇప్పటివరకు మెజార్టీ మున్సిపాలిటీల్లో పన్నుల వసూళ్లు 60 శాతం దాటకపోవడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా పరిధిలోని నియోజకవర్గాల్లోని మున్సిపాలిటీల్లో వసూలైన పన్నుల వివరాలను పరిశీలిస్తే..

షాద్‌నగర్ నియోజకవర్గంలో..

కొత్తూరు మున్సిపాలిటీలో సుమారు పదిహేను వేల మంది నివసిస్తున్నారు. 2,619 నిర్మాణాలకు అసెస్‌మెంట్ చేశారు. వీటి నుంచి రూ.2.56 కోట్లు ఆస్తిపన్ను వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటివరకు 1.57 కోట్లు వసూలు కాగా, మరో రూ.98.6 లక్షలు వసూలు కావాల్సి ఉంది. షాద్‌నగర్ మున్సిపాలిటీలో 15,180 నిర్మాణాలకు అసెస్‌మెంట్ చేసి రూ.6.21 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటివరకు రూ.3.18 కోట్లు మాత్రమే వసూలైంది. ఆస్తిపన్ను రూపంలో మున్సిపాలిటీకి అతి తక్కువ ఆదాయం సమకూరుతోంది. వచ్చిన ఆదాయం సిబ్బంది వేతనాలకు కూడా సరిపోవడం లేదు. దీంతో అభివృద్ధి పథకాల అమలుకై ప్రభుత్వంపైనే ఆధారపడాల్సి వస్తోంది. ప్రభుత్వం ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో ఇతర మున్సిపాలిటీతో ఈ రెండు మున్సిపాలిటీలు అభివృద్ధిలో పోటీపడలేకపోతున్నాయి.

మహేశ్వరం నియోజకవర్గంలో..

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఈ యేడాది 20,248 నిర్మాణాలకు అసెస్‌మెంట్ చేశారు. వీటిలో 17,927 గృహ, 1340 వాణిజ్య, 1017 మిక్స్‌డ్(గృహ, వాణిజ్య) భవనాలు ఉన్నాయి. వీటి నుంచి రూ.17.20 కోట్ల ఆస్తిపన్ను వసూలు కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.8.50 కోట్లే వసూలైంది. అదేవిధంగా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రెండు లక్షలకుపైగా జనాభా ఉంది. ఇక్కడ 40వేల వరకు నిర్మాణాలు ఉన్నాయి. వీటినుంచి రూ.25 కోట్ల ఆస్తిపన్ను వసూలు కావాల్సి ఉండగా.. ఇప్పటివరకు రూ.10కోట్లే వసూలైంది. నిర్మాణాలు ఇక్కడే ఎక్కువ. అధికారులు లక్ష్యానికి తగ్గట్టుగా పన్నులు వసూలు చేయడం లేదు. మున్సిపల్ అధికారులు స్థానిక భవన యజమానులతో కుమ్మక్కై.. అసెస్‌మెంట్లు కూడా చాలా తక్కువగా వేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పేరుకు మున్సిపాలిటీలే అయినా..ఇప్పటికీ గ్రామీణ వాతావరణం కనిపిస్తోంది. పన్నుల రూపంలో వచ్చిన మొత్తం సిబ్బంది జీతభత్యాలకు కూడా సరిపోవడం లేదు. అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, చెరువుల సుందరీకరణ వంటి చిన్నచిన్న పనులకు కూడా ప్రభుత్వం వద్ద చేయి చాచాల్సిన పరిస్థితి ఉంది. ఇతర మున్సిపాలిటీలతో పోలిస్తే.. జల్‌పల్లిలో చాలా తక్కువ ఆస్తిపన్ను వసూలవుతోంది. దీనికి తోడు అభివృద్ధిలోనూ చాలావరకు వెనుకబడే ఉంది.

శంకర్‌పల్లి, ఆమనగల్‌లో..

శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో 6,381 నివాసాల నుంచి రూ.6.38 కోట్ల ఆస్తిపన్ను వసూళ్లు చేయాలని టార్గెట్‌గా నిర్ణయించారు.ఇప్పటివరకు రూ.84.76 లక్షలు మాత్రమే వసూలు చేశారు.మరో రూ.5.53 కోట్లు వసూలు కావాల్సి ఉంది. కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలోని ఆమనగల్ మున్సిపాలిటీలో సుమారు 30వేల మంది వరకు నివస్తున్నారు. ఇక్కడ 5,483 నిర్మాణాలు ఉండగా,వీటి నుంచి ఏటా రూ.2.07 కోట్ల ఆస్తిపన్ను వసూలు కావాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.60.14 లక్షలే వసూలైంది.



తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో..

తుర్కయాంజాల్ మున్సిపాలిటీలో 19,468 నిర్మాణాలు ఉన్నాయి. వీటి నుంచి ఏటా రూ.10. 21 కోట్ల ఆస్తిపన్ను వసూలు కావాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.5.97 కోట్లు మాత్రమే వసూ లైంది. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 40వేల జనాభా ఉంది.ఇక్కడ మొత్తం 14వేలకుపైగా నిర్మాణాలు ఉన్నాయి. వీటి నుంచి ఏటా రూ.4.50 కోట్ల ఆస్తి పన్ను వసూలు కావాల్సి ఉండగా.. ఇప్పటివరకు రూ.2.80 కోట్లే వసూలైంది. ఆదిభట్ల మున్సిపాలిటీలో 23,953 మంది నివసిస్తున్నారు. 5,898 నివాసాలకు అసెస్‌మెంట్ చేయగా రూ.3.31 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించి, ఇప్పటివరకు రూ.1.59 కోట్లు మాత్రమే వసూలు చేశారు. ఇక పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో రూ.17.05 కోట్లు టార్గెట్ పెట్టుకోగా ఇప్పటివరకు రూ.8.09 కోట్లే వసూలు చేశారు. ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఈ మున్సిపాలిటీలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు, బహుళ అంతస్థుల నిర్మాణాలు భారీగా వెలుస్తున్నాయి. ఆస్తిపన్నుల అసెస్‌మెంట్ చేయడంలో ఆయా అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారు. పన్ను వసూళ్ల లక్ష్యం ఘనంగా నిర్దేశించుకున్నప్పటికీ వసూళ్లలో మాత్రం ఆశించిన స్థాయిలో ఉండటం లేదు.

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో..

ఈ నియోజకవర్గ పరిధిలో మణికొండ, నార్సింగి, బండ్లగూడ జాగీర్, శంషాబాద్ మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆస్తిపన్ను వసూళ్లలో ఇతర మున్సిపాలిటీలతో పోలిస్తే మణికొండ టాప్‌లో ఉంది. భూముల వేలం, బహుళ అంతస్తుల భవనాలు అసెస్‌మెంట్స్, ట్రేడ్ లైసెన్సులు, అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులు, ఐటీ అనుబంధ కంపెనీలు అధికంగా ఉండటమే అధిక ఆదాయానికి కారణం. మున్సిపాలిటీ పూర్తిగా సొంత ఆదాయంపైనే ఆధారపడి ఉంది. ప్రభుత్వం నుంచి పెద్దగా నిధులు రాకపోయినప్పటికీ..ఆస్తి పన్ను రూపంలో వచ్చిన సొంత నిధులతో దూసుకుపోతోంది. అదే విధంగా నార్సింగి, బండ్లగూడలో కొత్త అపార్ట్‌మెంట్లు, ఇతర వాణిజ్య సంస్థలకు సంబంధించిన ఆస్తులు, వాణిజ్య సముదాయాలపై ఎప్పటికప్పుడు అసెస్‌మెంట్స్ చేసి బిల్లులు జారీచేస్తే..వాటికి మరింత ఆదాయం సమకూరే అవకాశం ఉంది. రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి పైపులైన్లు, పార్కులు, ఇతర చిన్నచిన్న పనులకు ప్రభుత్వాన్ని యాచించాల్సిన అవసరం ఉండబోదు. మణికొండ మున్సిపాలిటీ 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.45.28 కోట్ల ఆస్తిపన్ను వసూళ్లు లక్ష్యంగా పెట్టుకుని ఇప్పటి వరకు 50 శాతం వసూలు చేశారు. అదే విధంగా నార్సింగి మున్సిపాలిటీలో రూ.30 కోట్లు టార్గెట్ పెట్టుకుని, ఇప్పటివరకు 48 శాతం వసూలు చేశారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 2023–24 ఆర్థిక సంవత్సరానికి 33,139 నిర్మాణాలకు అసెస్‌మెంట్ చేయగా, రూ.27.43 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. కాగా ఇప్పటివరకు 11.34 కోట్లు మాత్రమే వసూలు చేశారు. ఇక శంషాబాద్ మున్సిపాలిటీలో పన్నులను రెట్టింపు వడ్డిస్తున్నారు. ఇది పూర్తిగా 111 జీఓ పరిధిలో ఉండుట, నిర్మాణాలకు అనుమతులు లేకపోవడమే ఇందుకు కారణం. ఇల్లీగల్ భవనాలకు అపరాధరుసుంతో వడ్డిస్తున్నారు. ఫలితంగా ఇతర మున్సిపాలిటీలతో పోలిస్తే ఇక్కడ ఆస్తిపన్ను డబుల్ అవుతుంది. అయినా అభివృద్ధి పనులకు నిధుల కొరత ఉండటం గమనార్హం.

గణతంత్ర దినోత్సవాలకు నిహిత చంద్రిక



మైలార్‌దేవ్‌పల్లి: ఈ నెల 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవాల్లో ఎన్‌సీసీ గ్రూప్ ప్రదర్శన విభాగంలో రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లికి చెందిన కె.నిహిత చంద్రిక ఎంపికైంది. తెలుగు రాష్ట్రాల నుంచి ఈ విద్యార్థిని ఎంపిక కావడం గమనార్హం. మైలార్‌దేవ్‌పల్లి టీఎన్జీఓస్ కాలనీలోని పయనీర్ స్కూల్‌లో నిహిత చంద్రిక 9వ తరగతి చదువుతోంది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎస్.ప్రమోద్ రెడ్డి, డైరెక్టర్ ఎస్.ప్రవీణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ తృప్తి పాటిల్, వైస్ ప్రిన్సిపాల్ బి.సుధీర్, ఎన్‌సీసీ ఏఎన్ ఓటీ మహేష్ కుమార్ గౌడ్‌లు నిహిత చంద్రికను అభినందించారు.

హామీల అమలులో కాలయాపన

- కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రజలను చైతన్యం చేయండి
- బీఆర్‌ఎస్ నాయకులతో జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో చేస్తున్న కాలయాపనపై ప్రజలను చైతన్యం చేయాలని జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ మండల, మున్సిపల్ అధ్యక్ష, కార్యదర్శులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పెద్దలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేంత వరకు దరఖాస్తులు, ఇంటింటి సర్వేల పేరుతో కాలం వెల్లదీసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం యత్నిస్తుందని.. ఈ అంశాలపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల భ్రమలు తొలగిపోతున్నాయని, ఎల్లకాలం అబద్ధాల మీద కాలం గడపడం సాధ్యంకాదన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు మహేశ్‌గౌడ్, జంగయ్య, కిషన్‌గౌడ్, రమేష్‌గౌడ్, బుగ్గరాములు, రమేష్, దామోదర్, బహదూర్ నాయక్, శ్రీకాంత్, రాజు, జగదీశ్, బాలకృష్ణ, భాస్కర్‌రెడ్డి, పరుశురాం పాల్గొన్నారు.



విద్యార్థులతో జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, అధికారులు

విభిన్న ఆలోచనలతోనే ఉత్తమ ఆవిష్కరణలు

- జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు

ఇబ్రహీంపట్నం: విద్యార్థుల సృజనాత్మకత, మేధాశక్తికి ప్రతిరూపమే ఈ వైజ్ఞానిక ప్రదర్శనలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురుకుల విద్యాపీఠంలో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్, గణిత, పర్యావరణ వైజ్ఞానిక ప్రదర్శన బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న సుశీందర్‌రావు మాట్లాడుతూ..భిన్నమైన ఆలోచనలు ఉంటేనే కొత్త ఆవిష్కరణలు పుడతాయన్నారు. ఏదైనా లక్ష్యాన్ని సాధించాలంటే నిరంతరంగా శ్రమించాలన్నారు. అనంతరం జ్యూరీ ప్లానటరీ సొసైటీ డైరెక్టర్ ప్రొఫెసర్ నేథనియల్ మాట్లాడుతూ.. నేడు మనం అనుభవిస్తున్న విజ్ఞాన ఫలాలు ఎంతోమంది శాస్త్రవేత్తల కృషి ఫలితమేనన్నారు. అలాంటి వారి జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని కొత్త ఆవిష్కరణలకు బాటలు వేయాలని విద్యార్థులకు సూచించారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. జిల్లాలోని 79 పాఠశాలల విద్యార్థులు 280 ప్రాజెక్ట్‌లు, ఉపాధ్యాయులు మూడు ప్రాజెక్ట్‌లు, 38 సెమినార్‌లు ప్రదర్శించబడినట్లు తెలిపారు. 56 పాఠశాలలకు చెందిన 7,500 మంది విద్యార్థులు, పేరెంట్స్ ఈ ఎగ్జిబిషన్‌ను తిలకించినట్లు వెల్లడించారు. గురుకుల విద్యాపీఠం ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ రాజిరెడ్డి, డీసీఈబీ సెక్రటరీ రాంచంద్రారెడ్డి, విద్యాధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘అమేజాన్’ సేవలు అభినందనీయం

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు
- సంస్థ సౌజన్యంతో షాబాద్‌లో ఆరోగ్య కేంద్రం ప్రారంభం

షాబాద్: పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. షాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులను అమేజాన్ వెబ్ సర్వీస్ ఆధ్వర్యంలో పునరుద్ధరించి బుధవారం ఆరోగ్య కేంద్రాన్ని అమెజాన్ వెబ్ సర్వీస్ వైస్ ప్రెసిడెంట్ కేబీఎప్ మిల్లర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ...పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధికి అమెజాన్ సర్వీస్ ముందుకు రావడం అభినందనీయం అన్నారు. కమ్యూనిటీలలో జీవన నాణ్యతను మెరుగుపరచడంలో ఏడబ్ల్యూఎస్ చూపిన నిబద్ధతకు ఇది తార్కాణమన్నారు. గత నెలలో ఏడబ్ల్యూఎస్ షాబాద్‌లోని తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్(టీఎస్‌ఎంఎస్) పునరుద్ధరణ, సుందరీకరణ పూర్తిచేసిందన్నారు. ఇది విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ ఆరోగ్య కేంద్రం 3వేల మందికి నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను అందిస్తుందన్నారు. 35 గ్రామాల్లోని 35వేల మంది రోగులకు ఈ కేంద్రం ద్వారా ప్రయోజనం చేకూరనుందన్నారు. ప్రసూతి, ఇమ్యునైజేషన్ నుంచి ఔట్ పేషెంట్ సేవలు, అత్యవసర సేవలు పొందవచ్చని తెలిపారు.



అతిథులను సన్మానించిన ఆస్పత్రి సిబ్బంది

కమ్యూనిటీలపై సానుకూల ప్రభావం..

అమెజాన్ వెబ్ సర్వీస్ వైస్ ప్రెసిడెంట్ కేవీఎన్ మిల్లర్ మాట్లాడుతూ.. కమ్యూనిటీలపై సానుకూల ప్రభావం చూపడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. షాబాద్ ఆరోగ్య కేంద్రం పునరుద్ధరణ, రంగారెడ్డి జిల్లాలోని నేదునూర్, మీర్‌ఖాన్‌పేట్, కందుకూరు, షాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు గ్రామీణ శిశుసంరక్షణ కేంద్రం) పునరుద్ధరణ చేపట్టామన్నారు. ఆరోగ్య సంరక్షణ కేంద్రం పునరుద్ధరణలో భాగంగా గదులన్నీ పూర్తిగా మార్చడంతో పాటు వెయింటింగ్ హాల్, మరుగుదొడ్లు, ఆరోగ్య కేంద్రానికి ఆనుకొని ఉన్న పార్కింగ్ స్థలం నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. భవనం దెబ్బతినకుండా వాటర్ ప్రూఫింగ్ చేశామన్నారు. ఈ కేంద్రంలోని లోపల, వెలుపల భాగాలకు కొత్తరూపు ఇచ్చామన్నారు. కొత్త ఫర్నీచర్ అందించామన్నారు. వైద్య పరికరాలతో సహా కేంద్రానికి అవసరమైన వస్తువులను కూడా సరఫరా చేశామన్నారు. ఏడబ్ల్యూఎస్ ఇండియా..సెర్ప్ సపోర్ట్‌తో ఈ సెంటర్ పునరుద్ధరణ పనులు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ దామోదర్, ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి, ఎంపీడీఓ అనురాధ, గ్రామ సర్పంచ్ సుబ్రమణ్యేశ్వరి రవీందర్, ఎంపీటీసీలు అశోక్, కుమ్మరి చెన్నయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, జంగయ్య, వెంకటేష్, డాక్టర్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది తదితరులున్నారు.



మత్తు చాక్లెట్లు విక్రయిస్తున్న కిరాణా దుకాణం ఇదే

మత్తు చాక్లెట్ల కలకలం

- కొత్తూరు పీఎస్ పక్కనే డంప్
- వాటికి బానిసలుగా యువత, విద్యార్థులు
- ఆందోళనలో తల్లిదండ్రులు

కొత్తూరు: రాష్ట్రంలో మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు, అధికారులు ఉక్కుపాదం మోపుతున్నప్పటికీ కొందరు వారి కళ్లుగప్పి విక్రయాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో కొత్తూరు పట్టణంలో స్కూళ్ల వద్ద విక్రయిస్తున్న మత్తు కలిగించే చాక్లెట్లను స్థానిక, ఎస్ఓటీ పోలీసులు మంగళవారం పక్కా సమాచారంతో పట్టుకున్నారు. ఈ విషయం బుధవారం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే వీటికి విద్యార్థులతో పాటు యువత, కార్మికులు బానిసలుగా మారినట్లు సమాచారం. సుమారు ఏడాది నుంచి గుట్టు చప్పుడు కాకుండా మత్తు చాక్లెట్ల దందా సాగుతున్నట్లు ప్రచారం జరుగుతుంది.

వెలుగుచూసిందిలా..

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న కొందరు విద్యార్థులు తరగతి గదుల్లోనే నిద్రిస్తున్నారు. మరికొందరు అకారణంగా కిందపడి కొద్దిసేపటి తర్వాత కోలుకుంటున్నారు. ఈవిషయాన్ని గమనించిన హెచ్‌ఎం అంగోర్‌నాయక్ బాధిత విద్యార్థులను మచ్చిక చేసుకున్నారు. దీంతో కొందరు తాము మత్తు, నిద్ర వచ్చే చాక్లెట్లను తింటున్నట్లు చెప్పుకొచ్చారు. తనకు కూడా నిద్ర రావడం లేదని చాక్లెట్లు కావాలని హెచ్‌ఎం చెప్పడంతో ఓ విద్యార్థి తెచ్చి ఇచ్చాడు. వెంటనే హెచ్‌ఎం ఆ చాక్లెట్‌ను ల్యాబ్‌కు పంపడంతో పాటు ఉన్నతాధికారులు, స్థానిక నాయకులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. రంగంలోకి దిగిన పోలీసులు విద్యార్థుల సమాచారంతో కొత్తూరు పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న కిరాణా దుకాణంపై దాడులు చేశారు. అక్కడ మత్తు చాక్లెట్లుగా భావిస్తున్న 8కిలోల చాక్లెట్లు, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

పోలీస్ స్టేషన్ పక్కనే డంప్

మత్తు కలిగిస్తున్నాయనే ఆరోపణలు ఉన్న చాక్లెట్లను పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న ఓ కిరాణా దుకాణంలో డంప్‌చేశారు. ఇక్కడి నుంచే ఆయా పాన్‌డబ్బాలు, ఇతర చోట్లకు చాక్లెట్లను సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. ఒక్కో చాక్లెట్‌ను రూ.20, కొన్ని దుకాణాల్లో రూ.25కు విక్రయిస్తున్నారు.

ఆందోళనలో తల్లిదండ్రులు

కొత్తూరు పట్టణంలో మత్తు చాక్లెట్ల ఉదంతంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ చాక్లెట్లకు తమ పిల్లలు కూడా బానిసలుగా మారారేమో..? తెలియకుండానే తిన్నారా..? అనే విషయాలను తెలుసుకుంటున్నారు. మత్తు కలిగించే చాక్లెట్లు పాన్‌డబ్బాలతో పాటు కొన్ని కిరాణా దుకాణాల్లో సైతం విక్రయిస్తున్నట్లు పట్టణంలో ప్రచారం జరుగుతోంది. వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు అలసట తగ్గి నిద్ర రావడానికి ఆ చాక్లెట్లను అలవాటు చేసుకున్నట్లు సమాచారం. వారు విధులకు వెళ్లిన తర్వాత అవే చాక్లెట్లను వారి పిల్లలు కూడా తింటు తోటి స్నేహితులకు ఇచ్చి వాటికి బానిసలుగా మార్చినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి.

నిందితులను శిక్షించాలి



కొత్తూరు పట్టణంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తు చాక్లెట్లు విక్రయించిన వారిని పోలీసులు కఠినంగా శిక్షించాలి. మత్తుకు అలవాటుపడిన విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు సరైన వైద్యం అందించాలి. పట్టణంలో నివాసం ఉంటున్న వివిధ రాష్ట్రాలకు చెందినవారి ఇళ్లలో తనిఖీలు చేపట్టాలి.

– శ్రీలత, జెడ్పీటీసీ, కొత్తూరు

ఆర్‌ఎంపీ క్లినిక్‌లో డ్రగ్స్ పట్టివేత



హనుమంతరావు క్లినిక్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎలాంటి లైసెన్స్‌లు లేకుండా డ్రగ్స్ విక్రయిస్తున్న ఆర్‌ఎంపీ వైద్యుడిని పోలీసులు అరెస్టు చేసిన సంఘటన ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. డ్రగ్స్ కంట్రోల్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ నుంచి వచ్చిన సమాచారం మేరకు తెలంగాణ అధికారులకు సమాచారం రావడంతో బుధవారం ఆదిభట్లలోని ఎంపీపటేల్‌గూడలో కె.హనుమంతరావు క్లినిక్‌పై దాడిచేశారు. కాగా దాడుల్లో యాభైవేల విలువైన యాంటీ బయాటిక్స్, అనాల్జెసిక్స్, యాంటీ అల్సర్ డ్రగ్స్, యాంటీ హైపెర్టెన్సివ్స్ తదితర 87 రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి డ్రగ్ లైసెన్స్ లేకుండా మందులు నిల్వ ఉంచినట్లు గుర్తించారు. మొత్తం లక్ష రూపాయల విలువైన స్టాక్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మందులు ప్రజల ఆరోగ్యాలపై చెడు ప్రభావం చూపుతాయని తెలిపారు. నిందితుడిని అరెస్టు చేశారు. ఈ దాడిలో అసిస్టెంట్ డైరెక్టర్ అంజుమ్ అబిదా, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బాలాపూర్ నాగరాజు, సరూర్‌నగర్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌రాజు పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా.. జాగ్రత్త

- వరుస సెలవుల నేపథ్యంలో ఇళ్లలో చోరీలు
- ఆభరణాలు, నగదు ఇంట్లో ఉంచుకోవద్దంటున్న పోలీసులు

షాద్‌నగర్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో వరుస సెలవుల రావడంతో చాలామంది బంధువుల ఇళ్లకు, స్వగ్రామాలకు, విహార యాత్రలకు వెళ్తుంటారు. ఇలాగే ఊళ్లకు వెళ్లేవారి ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తుంటారు. దొరికినకాడికి దోచుకొని పరారవుతుంటారు. ఇలాంటివి జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.



కేశంపేటలో ఇటీవల చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

- సెలవులకు ఊరు వెళ్తుంటే కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరిని ఇంట్లో ఉండేలా చూసుకోవాలి. అలాగే నమ్మకమైన వాచ్‌మెన్‌ను మాత్రమే ఇంటికి సెక్యూరిటీ గార్డుగా పెట్టుకోవాలి.
- ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి.
- ఇంట్లో విలువైన బంగారు, వెండి ఆభరణాలు, డబ్బులు ఉంచకూడదు.
- వాటన్నింటిని బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి. లేదంటే ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోవాలి
- ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టం ఉన్న తాళాలను అమర్చుకోవాలి
- కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. లేదంటే 100 డయల్ చేయాలి
- ఎక్కువ రోజులు ఊళ్లకు వెళ్తుంటే పక్కింటివారికి ఇంటి పరిసరాలను గమనించమని చెప్పాలి.
- వాహనాలను ఇంటి ఆవరణలో పార్కు చేసి తప్పనిసరిగా తాళం వేయాలి. ద్విచక్రవాహనాల చక్రాలకు చైన్స్‌తో కూడిన లాక్ వేయడం మంచిది.
- ఇంట్లో సీసీ కెమరాలను అమర్చుకొని వాటిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు చూస్తుండాలి.
- ఇంట్లో లేనప్పుడు ఇంటిముందు చెత్త చెదారం, న్యూస్ పేపర్లు, పాలప్యాకెట్లు, జమ కానివ్వకుండా చూసుకోవాలి. వీటిని కూడా గమనించి నేరస్తులు దొంగతనాలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయి.
- ఊర్లె ముందు ఇంటి ఆవరణలో ఉన్న లైట్లు వేసి వెళ్లాలి.
- ఇంటి డోరు తాళం వేసి కర్టన్‌ను వేయడం మర్చిపోవద్దు
- సోషల్ మీడియాలో మీరు బయటికి వెళ్లే విషయాన్ని ఇతరులకు షేర్ చేయడం మంచిది కాదు.

పీఎస్‌లో సమాచారం ఇవ్వాలి



సెలవుల్లో ఊర్లెవారు విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదును బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి. ఇళ్లకు తాళాలు వేసిన వారు విధిగా పోలీసులకు సమాచారం అందించాలి. ప్రతి ఇంట్లో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఇంటి పొరుగువారికి సమాచారం ఇచ్చి గమనించమని చెప్పాలి.

– ప్రతాప్‌లింగం, సీఐ షాద్‌నగర్ టౌన్

ప్రజలు సహకరించాలి



పండుగకు ఊరు వెళ్లాల్సివస్తే బంగారు, వెండి ఆభరణాలు, డబ్బులను బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలి లేదా ఇంట్లో రహస్య ప్రదేశంలో దాచుకోవాలి. ఇంటి తలుపులకు సెంట్రల్ లాక్ సిస్టం గల తాళాన్ని అమర్చుకోవాలి. బయటికి వెళ్తున్న విషయం సోషల్ మీడియాలో ఇతరులకు షేర్ చేయడం మంచిది కాదు.

– ఆమనగల్లు, సీఐ, వెంకటేశ్వర్లు

బైక్‌ను ఢీకొట్టిన కారు.. వ్యక్తికి గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ అర్జున్

మాడ్గుల: నర్సాయిపల్లి సమీపంలో బుధవారం సాయత్రం కారు బైకు ఢీకొన్న సంఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మాడ్గులకు చెందిన మహేశ్ తన కారులో మాల్ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా నర్సాయిపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న బైకును ఢీకొట్టాడు. దీంతో బైక్ నడుపుతున్న అర్జున్ అనే యువకుడికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వెంటనే అతన్ని హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ డ్రైవర్లకు తీరని అన్యాయం

సీఐటీయూ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్



రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నేతలు, లారీ డ్రైవర్లు

అబ్దుల్లాపూర్‌మెట్: భారత న్యాయ సహితే చట్టంలోని సెక్షన్ 106 మరియు 1.2 చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దుచేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తూ బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొత్తగూడెం కూడలిలో విజయవాడ జాతీయ రహదారిపై ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాస్తారోకోలో హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అజయ్ బాబు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జాతర రుద్రకుమార్‌తో కలిసి నిరసన తెలిపారు ఈ సందర్భంగా పుప్పాల శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రభుత్వం కొత్త చట్టం తీసురావాలన్నా...ఉన్న చట్టంలో సవరణ చేయాలన్న ముందుగా లా కమిషన్ ఆఫ్ ఇండియాను సంప్రదించాల్సి ఉంటుందన్నారు. ఈ చట్టం ద్వారా ప్రతీ డ్రైవర్‌కు అన్యాయం జరుగుతుందన్నారు. ఆటో డ్రైవర్ లేదా లారీ మోటర్ డ్రైవర్‌కు మాత్రమే కాకుండా డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన ప్రతి వ్యక్తికి ఈ చట్టం వర్తిస్తుందని.. ఈచట్టం వల్ల డ్రైవర్లకు ఇబ్బందులు తప్పవన్నారు. పార్లమెంట్‌లో ఈ చట్టాన్ని ప్రవేశపెట్టి ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి చెందిన ఎంపీలందరూ ఈ చట్టాన్ని వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు నర్సింహ, ప్రభాకర్, రాములు, వీరయ్య, శ్రీశైలం, శంకర్, జహంగీర్, అబ్దుల్, రహీం, షరీఫ్, రఫీక్, డ్రైవర్లు పాల్గొన్నారు.

మాటలతో బురిడీ కొట్టించి..

- మహిళ పుస్తెలతాడుతో నిందుతుడి పరార్
- కొందుర్గు మండలం ఆగిర్యాలలో ఘటన

కొందుర్గు: మాయమాటలతో మహిళ మెడలో నుంచి ఓ దుండగుడు బంగారు పుస్తెలతాడును అపహరించిన ఘటన కొందుర్గు మండలం ఆగిర్యాలలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగిర్యాలకి చెందిన దేవమ్మ(55) గ్రామ శివారులోని సపోట తోటలో పనిచేస్తుండగా గుర్తుతెలియని ఓవ్యక్తి తోట వద్దకు వచ్చి కుర్వ మల్లయ్య దగ్గర మేకలు విక్రయించేందుకు వచ్చానని అతనితోట ఎక్కడ ఉందో చెప్పాలని అడిగాడు. ఆమె అతని ఫాం ఇక్కడ లేదని చెప్పింది. సపోటా పండ్లు అమ్మేవి ఉన్నాయా అంటూ సదరు వ్యక్తి మాటల్లో దింపాడు. లేవని ఆమె చెప్పడంతో.. తాగడానికి నీళ్లు కావాలని అడిగాడు. నీళ్ల మోటార్ బోరు వద్ద ఉన్నాయేమో చూడమని చెప్పింది. ఇదే అదునుగా దేవమ్మ మెడలోని బంగారు పుస్తెలతాడుతో పాటు సెల్‌ఫోన్‌ను లాక్కొని బైక్‌పై రెడీగా ఉన్న మరో వ్యక్తితో పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. ఘటనాస్థలిని ఏసీపీ రంగస్వామి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



కృష్ణనాయక్(ఫైల్)

కడ్తాల్: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాలు.. కడ్తాల్ మండలం రేక్యాతండాకు చెందిన నేనావత్ కృష్ణనాయక్(45) కుటుంబ సభ్యులతో కలిసి కూలీ పనులు చేసుకుంటూ, మండల కేంద్రంలో నివాసం ఉంటున్నాడు. బుధవారం సాయంత్రం నడుచుకుంటూ శ్రీశైలం- హైదరాబాద్ జాతీయ రహదారిపై నుంచి ఇంటికి వెళ్తుండగా విక్రమ్ రెస్టారెంట్ వద్ద హైదరాబాద్ వైపు అతివేగంగా వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్ర రక్తగాయాలైన కృష్ణనాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో పాటు మరో వాహనాన్ని సైతం ఢీకొట్టిన వాహనం హైదరాబాద్ వైపు వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సోనీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జాతీయ రహదారిపై విరిగిపడిన చెట్టు కొమ్మ



కేసారం స్టేజీ వద్ద రోడ్డుపై విరిగిపడిన మర్రి చెట్టు కొమ్మ

- తప్పిన ప్రమాదం
- ట్రాఫిక్‌కు అంతరాయం

చేవెళ్ల: మండల పరిధిలోని హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారిపై మర్రి చెట్టు భారీ కొమ్మ విరిగిపడి వాహనదారులకు ప్రమాదం తప్పింది. ఈ సంఘటన చేవెళ్ల మండలంలోని కేసారం బస్ స్టేజీ సమీపంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. వాహనాలతో రద్దీగా ఉండే హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారికి రెండు వైపులా భారీ మర్రి చెట్లు ఉన్నాయి. గతంలో కూడా పలుమార్లు వీటి కొమ్మలు అకస్మాత్తుగా విరిగిపడి అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనల్లో వాహనదారులు ప్రాణాలు సైతం కోల్పోయారు. తాజాగా ఎలాంటి గాలివాన లేకపోయినా ఓ చెట్టు భారీ కొమ్మ విరిగి రోడ్డుపై పడిపోయింది. ఇది గమనించిన వాహనదారులు కొద్ది దూరంలోనే ఆగిపోవడంతో పెనుప్రమాదమే తప్పింది. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించడంతో వారు జేసీబీ సాయంతో కొమ్మను పక్కకు వేయించారు. ఘటనతో కొద్దిసేపు వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పాడితో లాభాలు ఆర్జించాలి



సీతారంపేటలో నిర్వహించిన శిబిరంలో పశువైద్య అధికారులు

ఇబ్రహీంపట్నం: పశువులకు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించాలని రైతులకు జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి అంజలప్ప సూచించారు. మున్సిపల్ పరిధిలోని సీతారాంపేటలో బుధవారం నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పశువులకు చూడి పరీక్షలు నిర్వహించి, తగిన చికిత్సలు చేయించాలన్నారు. పాడి ద్వారా అధిక లాభాలు పొందాలని రైతులకు సూచించారు. పాడి పాశువుల పెంపకంతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య, పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు విజయ్‌కుమార్‌రెడ్డి, పశువైద్యాధికారులు వసంతకుమారి, సురేష్ బాబు, కవిత, గోపాల మిత్ర జగన్, నర్సింహ, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా ప్లాట్ల విక్రయాలు

- ప్రశ్నించిన ఎంపీపీ, ఆమె భర్తపై దాడి
- మేడిగడ్డతండా సమీపంలో ఘటన



గాయాలతో ఎంపీపీ భర్త విజయ్

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మేడిగడ్డతండా సమీపంలోని ఓ వెంచర్ వద్ద బుధవారం ఆమనగల్లు ఎంపీపీ అనిత, ఆమె భర్త విజయ్‌పై కొందరు దుండగులు దాడి చేశారు. ఆమనగల్లు ఎస్ఐ బల్‌రాం తెలిపిన వివరాల ప్రకారం.. ఆమనగల్లు మండలం మేడిగడ్డతండా సమీపంలో ఓ ప్రైవేట్ వెంచర్‌ను ఏర్పాటు చేసి అనుమతి లేకున్నా ప్లాట్లు విక్రయిస్తున్నారన్న ఫిర్యాదు రావడంతో బుధవారం వెంచర్‌ను ఆమనగల్లు ఎంపీపీ అనిత, ఆమె భర్త విజయ్, ఆమనగల్లు ఎంపీటీ శ్రీలత, మేడిగడ్డతండాడ గ్రామ కార్యదర్శి వెంకటయ్య సందర్శించారు. వెంచర్‌కు అనుమతి లేకపోవడంతో అక్కడ ఉన్న జెండాలను తొలగించారు. దీంతో వెంచర్ సూపర్‌వైజర్ రవీందర్‌నాయక్ ఎంపీపీని ఉద్దేశించి ఇక్కడ మీకేం పని అంటూ ప్రశ్నించడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. మాటామాటా పెరిగి భార్యాభర్తలపై రవీందర్‌నాయక్ దాడి చేశాడు. ఈ దాడిలో విజయ్‌కి గాయాలయ్యాయి. ఎంపీపీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని.. గాయపడిన విజయ్‌ను చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ బల్‌రాం తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఆదాయం

- పీవీ పశు వైద్య కళాశాల వైస్ చాన్స్‌లర్ రవీందర్‌రెడ్డి
- ఎస్సీ, ఎస్టీ రైతులకు పెరటి కోడి పిల్లల పంపిణీ



రైతులకు కోడిపిల్లలు పంపిణీ చేస్తున్న వైస్ చాన్స్‌లర్, పశువైద్యాధికారి

షాబాద్: రైతులు పెరటి కోళ్ల పెంపకంపై దృష్టి సారించాలని రాజేంద్రనగర్ పీవీ నర్సింహారావు పశు వైద్య కళాశాల వైస్ చాన్స్‌లర్ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని రాంసింగ్‌తండా, హన్మనాయక్‌తండాల్లో ఎస్టీ సబ్‌ప్లాన్ కింద వంద మంది రైతులకు ఉచితంగా పెరటి కోడి పిల్లలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేద ఎస్సీ, ఎస్టీ రైతులకు పెరటి కోళ్ల పంపిణీ చేస్తే ఆర్థిక అభ్యున్నతి సాధిస్తారని తెలిపారు. పెరటి కోళ్ల పెంపకం ద్వారా రైతులకు మంచి ఆదాయం లభిస్తుందన్నారు. గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ రైతులు పెరటి కోళ్ల పెంపకాన్ని చేపట్టాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఒక్కొక్కరికి 20 కోడి పిల్లలు, పది కిలోల దాణా ఉచితంగా అందజేస్తోందని స్పష్టంచేశారు. ఈ యూనిట్ ధర రూ.1,500 ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేగడిదోస్వాడ పశు వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామస్తులు, వైద్య సిబ్బంది, తదితరులున్నారు.

చేవెళ్ల అభివృద్ధికి సహకరించండి



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన భీంభరత్

షాబాద్: చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం నగరంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి విన్నవించారు.

మహనీయుల బాటలో నడవాలి

- ఎఫ్‌సీఎన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ గీతాథామస్‌రెడ్డి
- విద్యార్థులకు వివేకానందుడి పుస్తకాల అందజేత



విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న డాక్టర్ గీతథామస్‌రెడ్డి

షాద్‌నగర్ రూరల్: మహనీయులు జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకొని వారి అడుగు జాడల్లో నడవాలని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్‌నీడ్(ఎఫ్‌సీఎన్) సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ గీతథామస్‌రెడ్డి అన్నారు. 'వివేకానందుడి జీవితం.. ఆయన సందేశం' వివరాలతో ముద్రించిన పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విజయం సాధించడానికి కావాల్సిన పవిత్రత, సహనం, పట్టుదల ప్రతిఒక్కరిలో ఉండాలన్నారు. యువకులు ధైర్యసాహసాలతో ముందుకు సాగినప్పుడే ఏదైనా సాధించగలుగుతారని సూచించారు. ఉన్నత విద్యతోనే అభివృద్ధి సాధ్యమని స్పష్టంచేశారు. కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది లేదని తెలిపారు. సమాజం మనకు ఏం ఇచ్చింది అనే విధానాన్ని విడనాడి.. సమాజ అభ్యున్నతికి మనం ఏం చేశాం అని ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆభరణాల చోరీ కేసులో..

- నిందితుడి అరెస్టు, సొత్తు స్వాధీనం
- సింగరేణి కాలనీకి చెందిన మహేష్‌గా గుర్తింపు





పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటో, బంగారం, సెల్‌ఫోన్లు

మంచాల: వృద్ధురాలిని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బెదిరించి బంగారు ఆభరణాలు, నగదు దొంగిలించిన ఆటో డ్రైవర్‌ను బుధవారం మంచాల పోలీసులు అరెస్టు చేశారు. మంచాల సీఐ కాశీవిశ్వనాథ్ కథనం ప్రకారం... ఆదివారం సంగారెడ్డి నుంచి ఆర్టీసీ బస్సులో ఎంజీబీఎస్ బస్‌స్టేషన్‌కు కొవ్వూరి లక్ష్మి అనే వృద్ధురాలు వచ్చింది. అక్కడ నుంచి అమీర్‌పేట్‌లో నివాసం ఉండే తన చిన్నకూతురు ఇంటికి తీసుకొనిపోవాలని కిరాయి ఆటో మాట్లాడుకుంది. అయితే ఆ ఆటో డ్రైవర్ వృద్ధురాలిని రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని రంగాపూర్-జాపాల అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి.. కత్తితో బెదిరించి మెడలో ఉన్న రెండు తులాల బంగారం, రూ.5వేల నగదు, సెల్‌ఫోన్‌ను తీసుకుని వృద్ధురాలిని అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. గత్యంతరం లేక అక్కడి నుంచి ఎలాగోలా రంగాపూర్ గ్రామం చేరుకున్న ఆ వృద్ధురాలు స్థానికుల సహకారంతో మంచాల పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన పోలీసులు కేసు నమోదు చేసి విచారణ మొదలు పెట్టారు. నిందితుడు నగరంలోని సింగరేణి కాలనీలో నివాసం ఉండే ఆటో డ్రైవర్ జాటోవత్ మహేష్‌గా పోలీసులు గుర్తించారు. బుధవారం అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. అతని నుంచి బంగారు గొలుసు, రూ.1500 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అతడి ఆటోను కూడా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రిమాండ్‌కు పంపిచారు.